సాక్షి
గుంటూరు
మంగళవారం ׀ 9 ׀ జనవరి ׀ 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన హరి మంజూష్, వేదశ్రీ సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



జనరిక్ దుకాణానికి కోడ్

తాడికొండ: తాడికొండ పీఏసీఎస్ తరఫున జనరిక్ మెడికల్ షాపు లైసెన్సు, స్టోర్ కోడ్ పత్రాన్ని ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో సొసైటీ చైర్మన్ షేక్ నగీనా సోమవారం అందుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 4,894, ఎస్ఎల్బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నంది నాటకోత్సవాల నిర్వహణ అద్భుతం: జేసీ



గుంటూరు వెస్ట్: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గత నెలలో నంది నాటకోత్సవాల్ని జిల్లా యంత్రాంగం సమష్టిగా అద్భుత రీతిలో నిర్వహించిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ప్రశంసించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు, సిబ్బందికి ఆమె జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నాటక రంగానికి ఎంతో ఆదరణ ఉందని నాటకోత్సవాలు నిరూపించాయని తెలిపారు. ముఖ్యంగా యువతరం కూడా ఎంతో మక్కువ చూపించిందని పేర్కొన్నారు. ప్రతి విభాగంలోనూ అధికారులు చక్కని సమన్వయం కనబరిచారని కొనియాడారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖరరావు, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, డీఎస్వో కోమలి పద్మ, ఉప రవాణా అధికారి షేక్ కరీంతో పాటు అధికారులకు ఆమె జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, డెప్యూటీ కలెక్టర్ కె. స్వాతి పాల్గొన్నారు.

రేపు ఇండో-ఇజ్రాయేలు ప్రాజెక్టుకు శంకుస్థాపన

నరసరావుపేట: ఇండో-ఇజ్రాయేలు ప్రాజెక్ట్‌లో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలం గుండ్లపల్లిలోని బాలాజీనగర్ తండా వద్ద 25.57ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.10కోట్లతో ఏర్పాటు చేసే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రానికి బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ సోమవారం వెల్లడించారు. ఈ కేంద్రంలో మిరప, టమాటో, చెర్రీ టమాటో, దోస, వంగ, క్యాప్సికం తదితర కూరగాయలపై పరిశోధనలు నిర్వహించి మేలైన వంగడాలు షేడ్ నెట్ ద్వారా పెంచి, రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. శంకుస్థాపనలో వ్యవసాయ, జలవనరుల శాఖ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్. శ్రీధర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.11.81లక్షలు

దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.11,81,708 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ ఈవో పప్పుల కృష్ణంరాజు, కరాలపాటి సుబ్బారావు, కలవల వెంకటేశ్వర్లు, సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.

యార్డుకు 70,720 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 70,720 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 65,591 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 22,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,755 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

రేపు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జూనియర్ బాలురబాలికల జట్టు ఎంపిక ఈనెల 10న మున్సిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు పీడీ కత్తి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 20 నుంచి 24 వరకు నంద్యాల్లో జరిగే అంతర్ జిల్లా పోటీలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5-2-2003 తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. బాలురు 70కేజీల్లోపు, బాలికల బరువు 65కేజీల్లోపు ఉండాలని సూచించారు.

దీర్ఘాయుష్మాన్‌భవ

పేదల ఆరోగ్యానికి సంజీవని

- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం
- నెఫ్రాలజీ విభాగంలో అత్యుత్తమ వైద్యసేవలు
- ఉచితంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు
- హెచ్ఐవీ బాధితులకు సైతం ఉచితంగా డయాలసిస్



ఆధునిక డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాట్కో ట్రస్ట్ చైర్మన్ నన్నపనేని తదితరులు

గుంటూరు మెడికల్: పేద కిడ్నీ పేషంట్లకు గుంటూరు జీజీహెచ్ వరంగా మారింది. ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందుతున్నాయి. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లతో పాటు హెచ్ఐవీ, ఇన్‌ఫెక్షన్లు ఉన్న వారికి కూడా ఉచితంగా డయాలసిస్ అందిస్తున్నారు. ఉత్తమ వైద్యసేవలు అందుతుండటంతో ఏడు జిల్లాలకు చెందిన రోగులు ఇక్కడకు వచ్చి చికిత్సపొందుతున్నారు.

24 గంటలు ఉచిత వైద్యసేవలు

జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం 18వ నంబర్ గదిలో నెఫ్రాలజీ వైద్య విభాగంలో ఓపీ రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల్ని అందిస్తున్నారు. సుమారు 100 నుంచి 150 మంది వరకు వారంలో చికిత్స కోసం వస్తున్నారు. ఓపీలో పరీక్షలు చేసిన తరువాత అడ్మిషన్ అవసరమైన వారిని 218 నంబర్ గదిలోని నెఫ్రాలజీ వార్డులో అడ్మిట్ చేసుకుంటారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొంది శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మొహమ్మద్ అస్లాం, డాక్టర్ నిహారిక వైద్య విభాగంలో సేవల్ని అందిస్తున్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్లలో రికార్డు

హెచ్ఐవీ, హెచ్‌సీవీ, ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకిన కిడ్నీ రోగులకు సైతం ప్రత్యేకంగా డయాలసిస్ వైద్యపరికరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవల్ని అందిస్తున్నారు. నెఫ్రోప్లస్ సంస్థ పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో డయాలసిస్ మెషిన్లు ఏర్పాటు చేసింది. ఆస్పత్రి అధికారులు సైతం నెఫ్రాలజీ వార్డులో డయాలసిస్ మెషిన్లు ఏర్పాటు చేశారు. డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో అవసరమైన వారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నారు. రోగి కుటుంబ సభ్యులు కిడ్నీలు దానం చేయడంతో ఇప్పటి వరకు 23 మందికి ఉచితంగా విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసి వైద్యులు రికార్డు సృష్టించారు.



జీజీహెచ్‌లో నెఫ్రాలజీ వార్డు

నాలుగేళ్లలో ఓపీలో చికిత్స పొందిన వారి వివరాలు	
2020	1,422
2021	6,94
2022	1,269
2023	1,468

ముందస్తు జాగ్రత్తలు అవసరం

కిడ్నీ జబ్బులు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ వ్యాధి సోకినా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే విముక్తి కల్పించవచ్చు. జీజీహెచ్‌లో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు అందిస్తున్నాం. డయాలసిస్ చేయించుకునేవారిలో 30శాతం మందికి కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుంది. జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్యసేవల్ని ఉచితంగానే అందిస్తున్నారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నాం. జీవితాంతం డయాలసిస్ చేయించుకోవాల్సిన వారికి ఉచితంగా ప్రభుత్వం నెలకు పదివేల రూపాయల చొప్పున పెన్షన్‌ను అందిస్తోంది.

– డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజీ విభాగాధిపతి

నూతన డయాలసిస్ యూనిట్

కిడ్నీ రోగులకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందించాలనే సదాశయంతో నాట్కో నెఫ్రాలజీ వార్డులో గత ఏడాది అక్టోబర్‌లో రూ. 20లక్షలతో ఎనిమిది పడకలతో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఎంతో మంది రోగులు నేడు ఉచితంగా డయాలసిస్ వైద్యసేవలు పొందుతున్నారు.

రూ. 40 కోట్లతో క్యాన్సర్ సెంటర్

ఆస్పత్రిలో రూ. 40 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను ట్రస్ట్ నిర్మించింది. ప్రతి ఏడాది కోటి రూపాయలకు పైగా ఖరీదైన క్యాన్సర్ మందులు కూడా ఉచితంగా అందజేస్తోంది. ఆర్థోపెడిక్ వార్డులో ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్ నిర్మాణం, చిన్నపిల్లల వార్డు ఆధునీకరణ, నర్సింగ్ హాస్టల్ నిర్మాణం.. ఇలా ఏటా నాట్కో ట్రస్టు ఆస్పత్రి అభివృద్ధిలో తమ వంతు సాయం అందజేస్తోంది.

నేడు 'గుంటూరు కారం' ప్రీ రిలీజ్ ఈవెంట్



పాత గుంటూరు: ప్రముఖ హీరో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం చిత్రం ఈనెల 12న విడుదల పురస్కరించుకొని మంగళవారం నంబూరు క్రాస్ రోడ్ లోని మైదానంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు శ్రేయాస్ మీడియా ఈవెంట్ నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని హోటల్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హీరో మహేష్ బాబు, హీరోయిన్ శ్రీలీలతో పాటు చిత్ర యూనిట్ పాల్గొంటుందని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ రాధాకృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు కోట శేషగిరిరావు, బాజీ, కొండబోయిన శ్రీను, పర్వేజ్ చిష్టి పాల్గొన్నారు.

'వాహన్ పోర్టల్'ను వినియోగించుకోవాలి

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలోని వాహనదారులంతా పూర్తిస్థాయి కార్యకలాపాల్ని ఇకపై వాహన్ పోర్టల్ ద్వారా కొనసాగించాలని డీటీసీ షేక్ కరీం సూచించారు. స్వర్ణ భారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వాహన బదిలీలు, చిరునామా మార్పు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఎన్‌వోసీ, ట్యాక్స్ చెల్లింపుల సేవల్ని వాహన్ ద్వారా పొందాలని ఆయన సూచించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని ఆర్టీఏ పరిధిలో ముందుగా అన్ని రకాల వాహనాలకు సంబంధించి సేవల్ని ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన వాహన్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ ప్రగతి సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహిస్తున్న సేవలు ఇకపై వాహన్ అండ్ సారథితో అనుసంధానం అయినట్లు వివరించారు. వాహన యజమానులు httpr;//parivahan.gov.in/parivahan/ద్వారా లాగిన్ అయి సేవలు పొందాలని సూచించారు.

గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రోగికి పునర్జన్మ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ రెండో యూనిట్ వైద్యులు అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు రూ.15లక్షల ఖరీదుచేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేసి రోగికి పునర్జన్మ ఇచ్చారు. సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. శ్రీకాళహస్తి జిల్లా రామాపురానికి చెందిన 45 సంవత్సరాల వై.రాగమ్మకు తిరుపతి రుయా ఆసుపత్రిలో లాపరోస్కోపిక్ కోలిసిస్టెక్టమి ఆపరేషన్ చేసి లివర్ కింద ఉన్న రాళ్లను తొలగించారు. రెండో రోజు నుంచి డ్రైన్ ట్యూబ్ నుంచి పసరు వస్తుండటంతో తిరుపతి వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు పంపించారు. గత ఏడాది నవంబర్ 21న జనరల్ సర్జరీ వైద్య విభాగానికి రాగమ్మను కుటుంబ తీసుకొచ్చారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. ఆమెకు పలు వైద్య పరీక్షలు చేసిన తర్వాత డిసెంబర్ 23న రూయన్‌వై హెపాటికో జుజునస్టమి అనే ఆపరేషన్ చేశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియ నాలుగు గంటలు పట్టినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలకు ప్రాధాన్యం

- జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్
- స్పందనలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

నగరంపాలెం: ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పలువురు ఫిర్యాదులు అందజేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి బాధల్ని ఆలకించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కోడలితో ఇబ్బందులు

కోడలిని ఎల్ఎల్‌బీ చదివించాం. పోటీ పరీక్షలకు హైదరాబాద్‌లో ఏడాదిపాటు తర్ఫీదు ఇప్పించాం. అక్కడ్నుంచి ఇంటికి వచ్చిన దగ్గర్నుంచి ఆమెలో మార్పు వచ్చింది. త్వరలో పెద్ద అధికారిణి ఉద్యోగం వస్తుందని మమ్మల్ని బెదిరించడం మొదలెట్టింది. ఈ క్రమంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదివ్వగా, పెద్దల సమక్షంలో రాజీ చేశారు. తప్పుడు ఫిర్యాదులతో తరుచూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల ఆమె, ఆమె కుటుంబ సభ్యులు దాడికి పాల్పడగా, కుడి కాలు అడుగు పాదం తొలగించారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నాం.

– దివ్యాంగుడు ఏసోబు, పెదకాకాని

హైకోర్టులో ఉద్యోగం పేరిట మోసం

వ్యవసాయ కూలీ పనులకెళ్తాను. ఇటీవల కుమారునికి ఏపీ హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని తెలిసిన వ్యక్తి నమ్మబలికాడు. దీంతో అతనికి విడతల వారీగా పేరేచర్ల, గుంటూరులో రూ. లక్షల్లో ముట్టజెప్పాను. ఓ జడ్జి పేరు చెప్పి, మా వద్ద నగదు తీసేసుకున్నాడు. కాల్ లెటర్ పేర్లతో ఇప్పటి వరకు మోసగించాడు. ఆఖరికి ఉద్యోగ విషయమై అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అతనిపై చర్యలు తీసుకోవాలి.

– షేక్ పెద్ద ఘన్‌సైదా, అమీనాబాద్, ఫిరంగిపురం

యువకుడి అసభ్య ప్రవర్తన

గత నెల 20న అక్క ఇంటి నుంచి మా ఇంటికెళ్తుండగా తెలిసిన ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై స్థానిక పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అయితే, నాతో అమర్యాదగా మాట్లాడిన యువకుడి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకు చర్యలు చేపట్టారు. అతనికి పలుకుబడి ఉందని తెలిసింది. నాపై తప్పుడు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలి.

– ఓ మహిళ, ఏటుకూరు

లైంగికంగా వేధింపులు

కొన్నాళ్ల కిందట నేను నివసించే వీధిలో ఓ కానిస్టేబుల్ ఉండేవాడు. అతడు కొంతకాలంగా లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈనెల 3న ఇంటి వద్ద నానాయాగీ చేశాడు. ఈ క్రమంలో కుడి కాలుకి గాయమైంది. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. అతనిపై చర్యలు తీసుకోవాలి.

– ఓ మహిళ, గుంటూరు సిటీ

అర్జీలు రీఓపెన్ అయితే చర్యలు

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- సచివాలయాల్లోనూ స్పందన అర్జీలను ఇవ్వాలని ప్రజలకు సూచన

గుంటూరు వెస్ట్: గ్రామ స్థాయిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలకు కలెక్టరేట్ వరకూ రావాల్సిన అవసరం లేదని, సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలను అందించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా అర్జీలు స్వీకరించాలని ఆమె ఆదేశించారు. ఒకసారి పరిష్కారమైన అర్జీ రీఓపెన్ కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్ని మండల స్థాయిలో ఈ నెల 10 నుంచి 30 వరకు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం వచ్చిన 236 అర్జీలను జేసీతో పాటు డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, డెప్యూటీ కలెక్టర్ కె. స్వాతి, జిల్లా అధికారులు పరిశీలించారు.

నా బిడ్డను ఆదుకోండి



నా బిడ్డకు 16 ఏళ్ల వయస్సు వచ్చింది. శరీరంతో పాటు బుద్ధి కూడా ఎదగలేదు. బిడ్డను చూసుకోవడంతో ఉపాధి కూడా ఇబ్బందిగా మారింది. ఆర్థిక చేయూత లేదా బ్యాంకు రుణం ఇప్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– సీహెచ్. పద్మ, దుర్గారావు, క్రోసూరు

అత్యాచారం కేసులో రౌడీషీటర్‌కు శిక్ష

20 ఏళ్ల జైలుశిక్ష,రూ.3,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు

నగరంపాలెం: నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన పోక్సో కేసులో నిందితుడైన రౌడీషీటర్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.3,500 జరిమానా విధిస్తూ గుంటూరు స్పెషల్ పోక్సో కేసు కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ సోమవారం తెలిపిన కేసు వివరాలు.. గతేడాది నల్లపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ దినేష్ అలియాస్ రాజేష్ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి దక్షిణ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రాజేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించగా, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షుల్ని కోర్టులో హాజరుపర్చగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్యామల ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా విచారణ జరిపారు. సాక్ష్యాధారాలతో రాజేష్‌పై నేరం రుజువైంది. దీంతో అతడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.3,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లలు, మహిళలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. నిందితులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం నుంచి తప్పించుకోలేరని చెప్పారు. కోర్టులో సమర్థ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నిందితునికి శిక్ష పడటంలో క్రియాశీలకంగా పనిచేసిన అప్పటి దక్షిణ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, స్పెషల్ పీపీ శ్యామల, కోర్టు లైజన్ ఎస్ఐ శివప్రసాద్, నల్లపాడు పీఎస్ కోర్టు హెచ్‌సీలు ప్రకాష్, ప్రసాద్‌ను ఎస్పీ అభినందించారు.

కొండమంజులూరుకు క్రికెట్ ఫీవర్

- పానెం హనిమిరెడ్డీస్ జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి సిద్ధం
- గ్రామంలో తొలిసారి నిర్వహణ
- పోటీల్లో పాల్గొననున్న రంజీ, ఐపీఎల్ క్రీడాకారులు
- నేడు ప్రారంభించనున్న సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి
- 16వ తేదీ వరకు అంగరంగ వైభవంగా పోటీలు

జే.పంగులూరు: ఆటలు మానసిక దృఢత్వానికే కాదు.. ఐకమత్యానికి కూడా దోహదపడతాయనడంలో సందేహం లేదు. అందునా సంక్రాంతి పండగ సమయాల్లో అయితే మరీనూ. ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా సొంతూరుకు వచ్చి ఆటలు ఆడుతుంటే ఆనందమే వేరు కదా. పంగులూరు మండలానికి క్రీడల విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. పంగులూరు గ్రామం అంటే ఖోఖోకు ప్రత్యేక స్థానం. ఇక్కడి జూనియర్ కళాశాలలో జాతీయ ఖోఖో పోటీల్ని నిర్వహించారు. అదే స్థాయిలో మండలంలోని కొండమంజులూరులో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు క్లబ్ నిర్వాహకులు. గ్రామంలో 1995లో కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఏర్పడింది. అప్పటి నుంచి సంక్రాంతి సందర్భంగా గత 26 ఏళ్లుగా రాష్ట్రస్థాయిలో, రెండేళ్ల నుంచి దక్షిణ భారత దేశ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ ఏడాది తొలిసారిగా 29వ సారి జాతీయస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. పోటీల్ని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి మంగళవారం ప్రారంభిస్తారు. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి అత్యంత ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఐపీఎల్, రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.



క్రికెట్ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

వారం రోజుల పాటు క్రీడా సందడి

గ్రామంలో జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని రెడీ చేశారు. పిచ్, అవుట్ ఫీల్డ్ అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి టీములు కూడా వచ్చాయి.

చీర్ గాల్స్, డీజే సౌండ్స్‌తో ఉత్సాహం


మ్యాచ్ సమయంలో క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో చీర్‌గాల్స్, డీజే సౌండ్స్, తీన్‌మార్ ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు భోజన సదుపాయం, వసతితో పాటు ఆటలో ప్రతిభ కనబరిచిన ప్రతి క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

భారీ నజరానా

- టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ. 6 లక్షలను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అందిస్తున్నారు.
- రెండో బహుమతి రూ. 4 లక్షలను వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బి.వి. కృష్ణారెడ్డి అందిస్తున్నారు.
- మూడో బహుమతి రూ.2 లక్షలను కొండమంజులూరు క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి అందిస్తున్నారు.
- ప్రతి స్థానానికి క్రికెట్ క్లబ్, గ్రామస్తుల సహకారంతో షీల్డ్ అందించనున్నారు.

సాగర్ కుడికాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు సోమవారం కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్‌గుప్తా పర్యవేక్షణలో నీటిని విడుదల చేశారు. కుడికాలువ 5, 7వ గేటు ద్వారా గేటుకు 2,500 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ మురళీధర్‌రెడ్డి, కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. సీఈ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టీఎంసీల నీటిని రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజులపాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈలు రఘునందనరావు, శివశంకర్, లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, సాగర్ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాబు మియా, భారతి, సాగర్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



20న క్యారమ్స్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర క్యారమ్స్ సంఘం పర్యవేక్షణలో ఈ నెల 20న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బాల బాలికల జూనియర్ క్యారమ్స్ పోటీలు జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకు, పేర్ల నమోదుకు జె.మురళీ కృష్ణ సెల్ నెంబర్ 91774 79119 నంబరులో సంప్రదించాలన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవ రావు సోమవారం తెలిపారు. వివరాలకు 9988853335 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకం

- లాయర్లకు ముఖ్యమంత్రి జగనన్న మేలు చేశారు
- లా నేస్తంతో జూనియర్ న్యాయవాదులకు రూ.50 కోట్ల మేర ఆర్థిక సాయం
- రూ. 100 కోట్ల సహాయ నిధిని ఏర్పాటు చేసిన ఘనత జగనన్నదే
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- మంత్రి రజినికి మద్దతు ప్రకటించిన న్యాయవాదులు



న్యాయవాదులతో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: సమాజంలో ఉన్న అన్నివర్గాల ప్రజలను ప్రభావితం చేయగలిగిన సత్తా న్యాయవాదులకు మాత్రమే ఉందని, నేటి పరిస్థితుల్లో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ధర్మం పక్షాన నిలబడి వాదించే న్యాయవాదులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉంటారని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా న్యాయవాదులు పెద్ద ఎత్తున సోమవారం కొరిటెపాడులో రోడ్డులోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, ఆమెకు వారి మద్దతును తెలియజేశారు. గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో సీఎం వైఎస్ జగన్ ఎంతగానో కృషి చేశారన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రజినమ్మ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రతినబూనారు.

జగనన్నకు అండగా ఉందాం

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలోకి వచ్చిన జూనియర్ న్యాయవాదులు.. ఆ వృత్తిలో నిలదొక్కుకునే వరకు వారికి సాయంగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.60 వేల చొప్పున.. మూడేళ్లకు మొత్తం రూ.1.80 లక్షలు ఇస్తోందని, ఏడాదికి రెండుసార్లు నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5,000 స్టైఫండ్ చొప్పున అందజేస్తున్న తొట్ట తొలి ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని తెలిపారు. మొత్తం 6,069 మంది యువ న్యాయవాదులకు ఈ నాలుగున్నరేళ్లలో మొత్తం రూ.49.51 కోట్ల ఆర్థికసాయం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీలు సభ్యులుగా రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేశారని, దీనివల్ల కోవిడ్ బాధిత న్యాయవాద కుటుంబాలకు ఏకంగా రూ.52 లక్షల మేర ఆర్థిక సాయం అందజేసే వీలు ఏర్పడిందని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలోనే న్యాయవాదులను ఆదుకునేందుకు ఏకంగా 7,733 మందికి రూ.11.56 కోట్లు మేర రుణాలు కూడా అందజేసినట్లు తెలిపారు. 14,848 మంది న్యాయవాదులకు మెడీక్లెయిమ్ పాలసీ కింద రూ.11.41 కోట్లు చెల్లించింది కేవలం సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. ఆపద సమయంలో అండగా నిలిచిన జగనన్నకు అందరం పూర్తిస్థాయిలో అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, విభాగం సభ్యులు, న్యాయవాదులు కె.వి.రమణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, వజ్రాలు రాజశేఖర్ రెడ్డి, వాసం సూరిబాబు, క్రాంతి కృష్ణారెడ్డి, ఆర్.మాధవి, బార్ కౌన్సిల్ మెంబర్, అనిల్, ఎం.శ్రీనివాసరావు, పల్లపు కృష్ణ, అశోక్, సుబ్బారెడ్డి, బి.కోటేశ్వరరావు, భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఇందిరా, నజీరా, వేముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు విస్తృత కార్యక్రమాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విస్తృత రీతిలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో మెప్మా కార్యక్రమాల పురోగతితో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రాంతీయస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జీవనోపాధి మెరుగుపడే విధంగా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు శిక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో మెప్మా గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు పి.వెంకట నారాయణ, ఇమ్మానుయేలు, టి.రవికుమార్, రాష్ట్ర కార్యాలయ ఏఓ రామాంజనేయులు, సబ్జెక్టు స్పెషలిస్టులు, రాష్ట్ర, నగర మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.